
MAJORITY – TELUGU WEEKLY Published on 31·07·2001



# కులాల విషయంలో పత్రికలది కపట నాటకం

## మానవ హక్కుల వేదిక ప్రతినిధి డాక్టర్ బాలగోపాల్‌తో మెజారిటి ప్రత్యేక ఇంటర్వ్యూ

**డాక్టర్ కె. బాలగోపాల్ అంటే ఆంధ్రాలో ఆబాల గోపాలానికీ ఎరుకే. ఆయన మాటలలో గానీ, చేతలలోగానీ స్పష్టంగా కనిపించేది స్పష్టతే. అందుకే కె. బాలగోపాల్ అంటే క్లారిటీ బాలగోపాల్ అని చెప్పుకోవచ్చు. ఏ సమస్యను ఎలా చూడాలో అర్థంకానపుడు అందరూ బాలగోపాల్ వైపు చూస్తారు. మేధావులను అబ్బురపరచే మేధస్సుతో, కార్యకర్తలకు కన్ను కుట్టేంత కాయ కష్టంతో రాష్ట్రంలో ఎక్కడ నిస్సహాయుల హక్కుల హరణాలాపాలు వినిపించినా అక్కడకు రెక్కలు కట్టుకు వాలి నిప్పులు కురిపించే హక్కుల బాలగోపాల్‌తో మెజారిటి ప్రతినిధి బి. అరుణ్ జరిపిన మాటా మంతి విశేషాలివి.**



**డాక్టర్ కె. బాలగోపాల్**

ప్ర॥ పత్రికలలో కులాల పేర్లు రాయవద్దని చెప్పి ఒకే కులం పరిమితికి మించి ఆస్థులు సంపాదిస్తున్నా నోరు విప్పని పత్రికల కుట్రపై వ్యాఖ్యానించండి ?

జ॥ ఆస్థులు బహుశా రెండు మూడు కులాలు పెంచుకొంటున్నాయేమో - ఒక కులమే కాకపోవచ్చు. అయితే కులం ఒక ప్రధాన సామాజిక వాస్తవమైన మన సమాజంలో వ్యక్తుల కులాలను గానీ, కులాల భోగభాగ్యాలను గానీ పేరుపెట్టి పత్రికలలో ప్రస్తావించలేకపోవడము వట్టి 'హిప్రోకసీ' తప్ప వేరే ఏమీ కాదు. నిజానికి చాలా కాలం మన పత్రికలలో 'అగ్రకులాలు' అన్న మాట ప్రయోగించేవారు కారు. ఈ మధ్య అప్పుడప్పుడూ ప్రయోగిస్తున్నారు. కానీ ఏ అగ్రకులం అని చెప్పకూడదు. కులాన్ని అందరూ - ముఖ్యంగా కులం నుండి బలం పొందే పెత్తందారీ కులాల వాళ్లు - అన్నిటికి నిత్యం వాడుకుంటూనే వుంటారు. సాధారణ సంభాషణల్లో కులం ప్రస్తావన ప్రతీ క్షణం వస్తూనే ఉంటుంది. అయినప్పటికి కులం పేరు పత్రికలలో కనిపించడాన్ని సహించకపోవడం, అదే పెత్తందారీతనం కొనసాగింపు. సామాజిక స్పృహ ఉన్న చిన్న పత్రికలైన దానిని ప్రతిఘటించాలి. ప్రస్తుతం ఉద్యమ సంస్థల పత్రికల మాత్రమే ఆ పని చేస్తున్నాయి.

**ప్ర॥ 'రేస్', కులంపై ఇటీవల చర్చ సాగుతోంది. వీటి గురించి వివరిస్తారా ?'**

జ॥ 'రేస్' అనే మాటకు సరియైన తెలుగు అనువాదం లేదు. ఇంగ్లీషులో కూడా దాని అర్థం అనిశ్చితంగానే ఉంది. యూదులను 'రేస్' అన్నారు. వారిని యితరుల నుండి వేరుచేసేది వర్ణం కాదు. ఒక ప్రత్యేకమైన మతం, మత ఆచారాలు, జీవన విధానాలు ప్రధానమైనవి. నల్లవారిని 'రేస్' అన్నారు. వారిని తెల్లవారి నుండి వేరుచేసేది వర్ణం ఒక్కటే కాకపోయినప్పటికీ అది ముఖ్యమైనది. ప్రాచీన కాలంలో మధ్య ఆసియా నుండి నాలుగు దిక్కుల విస్తరించిన ఆర్యులను 'రేస్' అన్నారు. ఈ వర్గీకరణకు ప్రాతిపదిక వర్ణంకాదు. మత ఆచారం కాదు. భాష అని చరిత్రకారులు అభిప్రాయం. ఏమైతేనేం, నల్లజాతీయుల పట్ల యూదుల పట్ల, అమలైన వివక్ష 'రేసిజం' అనే మాటకు సమానార్థకం అయ్యింది. ఐక్యరాజ్యసమితి ఆవిర్భావానికి గల కారణాలలో ఒకటి యూదుల పైన అమలైన అణిచివేత. అందువల్ల 'రేస్' ప్రాతిపదికపైన వివక్ష పాటించడానికి వీలులేదనేది ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలకు పెట్టిన నియామాలలో ఒకటి. ఆ తర్వాత దక్షిణాఫ్రికాలో తీవ్రస్థాయిలో అమలువుతున్న వర్ణ వివక్షపైన కూడా ఐక్యరాజ్యసమితి కృషిచేసింది.

ఈ క్రమంలో 'రేసిజం'కు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి అనేక సూత్రీకరణలు చేసింది. నియమాలు ప్రకటించింది. అది అమానుషం అన్న అభిప్రాయానికి అధికార ముద్ర వేసింది. అందువల్లనేనేమో మన దగ్గర ఉన్న దళిత ఉద్యమకారులు కులాన్ని కూడా 'రేస్'ను పోలిన వివక్షగా గుర్తించమని ఐక్యరాజ్యసమితిని అడుగుతున్నారు. ఉన్న వ్యవస్థను వాడుకోవడంలో ఉన్న సౌకర్యాన్ని కాదనలేము ప్రపంచ స్థాయిలో వర్ణ వివక్షకు వ్యతిరేకంగా గంభీర ప్రవచనాలు చేసే భారత పాలకులను ప్రపంచ వేదికపైనే కులాన్ని గురించి నిలదీయాలన్న ఆరాటాన్ని కాదనలేము. అయినప్పటికి కుల వివక్షను 'రేసిజం'కు సంబంధించిన ఒక రూపంగా చూడాలని కోరే బదులు, విడిగానే దాని పైన ఐక్యరాజ్యసమితి ఒక నియమావళిని రూపొందించాలనీ, భారత పాలకులను కులాన్ని గురించి నిలదీయాలని కోరితే బాగుండేది.

'రేసిజం'కూ, కులవ్యవస్థకూ చెప్పుకోదగ్గ రెండు తేడాలున్నాయి. 'రేస్' దైవ సృష్టి అని తెల్లవారు తమ మనస్సులలో అనుకున్నారేమో గానీ, కులం లాగ అది దైవ సృష్టేనని సూత్రీకరించలేదు. 'రేస్'లాగ కాక కులం అన్ని సామాజిక జీవిత రంగాలలోనూ వివక్షను వ్యవస్థీకరించింది. మనిషికి వుండే 'విలువ'లలో అసమానతను కూడా వ్యవస్థీకరించింది. అందువల్ల కుల వ్యవస్థను అమానవీయమైనదని నిషేదించే ప్రకటననూ విడిగానే ఐక్యరాజ్యసమితి రూపొందించాలని అడగడం ఉచితంగా వుంటుంది.

**ప్ర॥ ప్రాంతీయ అసమానతల గురించి ఇంత చర్చ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో కూడా ఉత్తరాంధ్ర వెనకుబాటుతనం ఎజెండా పైకి రావడంలేదు ఎందుకు ?**

జ॥ వెనుకుబాటు ఉన్నంతమాత్రాన ఒక ప్రాంతంగా గుర్తింపుగానీ, చర్చ గానీ, రావాలని లేదు. ఆ ప్రాంతానికి సంబంధించిన 'ఐడెంటిటీ' ఉండాలి. ఈ 'ఐడెంటిటీ' తెలంగాణాలో చాలా బలంగా ఉంది. రాయలసీమలో కొంతమేరకు ఉంది. కానీ ఉత్తరాంధ్రలో ప్రాంతీయ 'ఐడెంటిటీ' చెప్పుకోదగ్గ మోతాదులో ఉన్నట్టు కనిపించదు. 'కళింగాంధ్ర' అన్న మాట కొంతమంది ఉత్తరాంధ్రకు చెందిన మేధావులు ప్రయోగిస్తున్నారు గానీ, ప్రజల సంగతి అటుంచి బుద్ధిజీవుల్లో సైతం అదొక బలమైన భావన అని చెప్పలేము. ఇంకొక కారణం కూడా ఉందేమో! తెలంగాణా రాయలసీమల్లోని ప్రాంతీయ భావనలు 'కరువు' ఒక ముఖ్య అంశము. నలభై ఏళ్లు పైబడిన సమైక్య ఆంధ్రా తమ ప్రాంతాల్లో కరువునూ, ఆకలినీ పోగొట్టలేకపోయిందన్న ఆగ్రహం అక్కడ బలంగా ఉంది. ఉత్తరాంధ్రకు - రాష్ట్ర పాలకుల నిర్వాకంతో నిమిత్తం లేకుండా - కరువు సమస్య పెద్దగా లేదు. ప్రకృతి సిద్ధంగానే వర్షపాతం ఎక్కువ ఉంది. కొండ ప్రాంతం కావడంవల్ల ఏర్లు, నదులు ఎక్కువ ఉన్నాయి. ఈ ప్రకృతి సిద్ధమైన సంపద నుండి రాగల అభివృద్ధి తమ ప్రాంతానికి దక్కలేదనీ, దక్కిన అభివృద్ధి ఫలితం అత్యధికంగా మధ్య కోస్తాజిల్లాల వారికే దక్కిందనీ ఉత్తరాంధ్ర వాసుల అభియోగం. ఇది కరువుతో సమానమైన ఆగ్రహం కలిగించదేమో.

అంతేగాక తెలంగాణలో ఉన్న నిరసనలో భాష, సంస్కృతులకు సంబంధించిన బలమైన అంశం ఉంది. తెలంగాణా భాషనూ, సంస్కృతినీ సమైక ఆంధ్రా సాంస్కృతిక పెత్తందార్లు కించపరిచిన సంగతి తెలిసిందే. భౌతిక వెనుకబాటుతనంతో సమానంగా, బహుశా

అంతకంటే ఎక్కువగా ఈ కారణం కూడా తెలంగాణాలో వైమనస్యానికి కారణం అయింది.

**ప్ర॥ కాశ్మీరు సమస్యపై స్పష్టమైన అవగాహన ఉన్న వ్యక్తిగా మీకు పేరుంది. ఈ సమస్య ప్రసుత్త రూపం గురించి తెలపండి?**

జ॥ ప్రస్తుతం కాశ్మీరు సమస్యకు రాజకీయ పరిష్కారం వెతుకుతున్నామని మన పాలకులు అంటున్నారు. చివరికి జరగవలసింది అదే గానీ, అది నిజాయితీగా తీసుకొన్న నిర్ణయమా లేక ప్రపంచ దేశాల దగ్గర మంచిపేరు తెచ్చుకోవడం కోసం ప్రకటించినదా అని సందేహం వస్తున్నది. కాశ్మీరులోని మిలిటెన్సీకి నాయకత్వం వహిస్తున్న సంస్థల కేంద్రాలు పాకిస్తాన్‌లో ఉన్నాయి. వారితో చర్చిండం ద్వారా సమస్య పరిష్కారాని ఆవిష్కరిస్తామని మన పాలకులు ఆరు నెలల కిందటే అన్నారు. అందుకోసం కాశ్మీరులోని హురియత్ కాన్ఫిరెన్స్ నాయకుల బృందాన్ని పాకిస్తాన్‌కు పంపుతామని అన్నారు. కాశ్మీరు సమస్యకు రాజకీయ పరిష్కారమే సరియైన పరిష్కారమని నమ్మే వాళ్లందరూ ఇదొక మంచి పరిణామం అని సంతోషించారు. అయితే ఆరు నెలలు గడిచిన ఆ ప్రయత్నం ఒక అంగుళం కూడా ముందుకు పోలేదు. వేరే ఏ కారణాల వల్లనైనా అది ఆగిపోతే మన ప్రభుత్వాన్నేం అనలేము గానీ, దానిని ప్రతిపాదించిన ప్రభుత్వమే దానికి అడ్డుకట్ట వేసింది. మిలిటెంట్‌లతో చర్చలు మొదలుపెట్టడం కోసం పాకిస్తాన్‌కు హరియత్ కాన్ఫరెన్స్ ప్రతినిధి బృందాన్ని పంపుతామని అన్నవారు ఆ బృందానికి పాస్‌పోర్టులు ఇచ్చే విషయంలో ప్రదర్శించిన కుటిలనీతి వల్ల ఆ చర్చలు మొదలేకాలేదు.

ఇప్పుడు అర్థవంతమైన ఆ ప్రయత్నాన్ని మర్చిపోయి 'పంత్ రాయబారం' అనే అర్థరహితమైన తంతు మొదలుపెట్టారు. అతను పాకిస్తాన్‌కు పోవడం, పాకిస్తాన్‌లో ఉన్న మిలిటెంట్ సంస్థల నాయకులతో మాట్లాడడం వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న పాకిస్తాన్ ప్రభుత్వంతోను మాట్లాడడం ఇండియాలో ఉన్న కాశ్మీరులో ఎవరితో మాట్లాడి ఏం ప్రయోజనం? దీనిని బట్టి చూస్తే మన పాలకులకు కాశ్మీరు సమస్యను రాజకీయంగా పరిష్కరించి ఉద్దేశ్యం నిజానికి లేదని, ప్రపంచ దేశాల మెప్పుకోసం అటువంటి ప్రకటనలు అప్పుడప్పుడూ చేసినా కాశ్మీరును 'సైనికంగానే' నిలుపుకోవాలని భావిస్తున్నారని అనిపిస్తోంది. ఇది చాలా దురదృష్టకరం. వేరే ఎందుకోసం కాకపోయినా కాశ్మీరీల కోసమైనా మన ప్రభుత్వం ఈ వైఖరి మానుకోవాలని కోరవలసి వుంది.

**ప్ర॥ గ్లోబులైజేషన్, హిందూత్వ నినాదాలు ముందుకువస్తున్న ప్రస్తుత తరుణంలో మానవ హక్కులను పునర్ నిర్వచించుకోవలసిన అవసరముందా?**

జ॥ ఒక రకంగా ఈ రెండు పరిణామాలూ, హక్కుల ఉద్యమం ఆవిర్భావంలోనూ ఎదుగుదలలోనూ ఉన్న లోపాన్ని ఎత్తిచూపాయనుకొంటాను. భారతదేశంలో హక్కుల ఉద్యమం పోలీసుహింసను కేంద్రం చేసుకొనిపుట్టింది. ~~ఇప్పటికి అదే కేంద్రం చేసుకొని పుట్టింది~~. ఇప్పటికీ అదే కేంద్రంగా పనిచేస్తున్నది. పోలీసుహింస ఒక ముఖ్యమైన హక్కుల సమస్య అనడంలో ఎటువంటి సందేహం లేదు. కానీ ప్రతిసమాజంలోని హక్కుల ఉద్యమానికి అదే కేంద్రం కానవసరంలేదు. హైందవ సమాజానికి జీవితాన్ని శాసించే కుల వ్యవస్థనుండి పుట్టిన వివక్షను కేంద్రం చేసుకొని ఎదిగే హక్కుల ఉద్యమమే మన సమాజానికి ఉచితమైనదేమో. పోలీసుహింసను కేంద్రం చేసుకొని ఆవిర్భవించిన హక్కుల ఉద్యమం కుల వివక్షనూ అంటరానితనాన్నీ కూడా హక్కుల సమస్యలుగా గుర్తించింది గానీ వాటికి ఉచితమైన స్థానాన్ని ఇప్పటికింకా యివ్వలేదు. హిందూత్వ వాదం సామాజిక జీవితంలోనూ, రాజకీయ జీవితంలోనూ, బలపడడం ఈ లోపాన్ని కొట్టొచ్చినట్లు చూపించింది అనుకుంటాను. కులవ్యవస్థను మధ్య యుగాల నమూనాలలో పునరుద్ధరించే ఉద్దేశ్యంగానీ, అవకాశముగానీ వారికి ఉందనుకోను. కానీ కుల వ్యవస్థ భావజాలమైన నిచ్చెనమెట్ల ధర్మాన్ని దానికి అనువైన సామాజిక సంస్కృతిని స్థిరీకరించడము వారి లక్ష్యం. అది విశాల ప్రజా వర్గాల హక్కుల పైన దాడి. హక్కుల ఉద్యమం మొదటీనుండి ఈ హక్కుల సమస్యను కేంద్రం చేసుకొని పనిచేసి వుంటే ఈ పరిస్థితినీ మరికొంత సమర్థంగా ఎదుర్కొగలిగేదేమో.

తిండీ, బట్ట, నివాసం, ఉద్యోగం, మొదలయిన జీవన హక్కుల విషయంలో కూడా తనకంటూ ఒక వివరమయిన అవగాహన ఉండనక్కరలేదనే వైఖరే హక్కుల ఉద్యమం మొదటి నుండి కలిగి ఉంది. గ్లోబలైజేషన్ వచ్చి విధానపరంగానే పాలనలో ఈ హక్కులకు చోటు లేకుండా చేసారు. అదే హేతుబద్ధమయిన వైఖరి అనీ అంటున్నారు. ఈ 'హేతువు'ను హక్కుల కోణం నుండి విశ్లేషించి అందులోని అబద్ధాన్ని ఎండగట్టాలని హక్కుల ఉద్యమం చేయవలసి ఉంది. అందుకు మొదటినుండి ఇంకొంచెం సిద్ధంగా ఉంటే బాగుండేది.

ఇవి రెండూ పూర్తిగా విడివిడి కర్తవ్యాలుకావు. హిందుత్వంలోని నిచ్చెనమెట్ల 'ధర్మ' భావన ప్రపంచీకరణకు బాగా అతికే భావజాలం. 'స్వధర్మం' ఎంత హేయంగా తోచినా పరధర్మం ఎంత ఆకర్షణీయంగా తోచినా పర ధర్మానికి ఆవలదొద్దు, అది వినాశ హేతవు, అని శ్రీకృష్ణ పరమాత్మ అనలేదా? 'నీకు తిండిలేదనీ సమాజాన్ని తిట్టవద్దు. నీ దగ్గర వనరులుంటే నా సామర్థ్యం ఉంటేనూ అవి నీకు దక్కుతాయనీ లేకపోవడం నీ తప్పేననీ గ్రహించు అని ప్రపంచీకరణ వాదులు అనడం లేదా?

**ప్ర॥ మానవ హక్కుల వేదికను స్థాపించి రెండున్నర ఏళ్లు అయింది కదా! ఈ కాలంలో ఈ సంస్థ నిర్వహించిన కార్యకలాపాలు గురించి వివరించండి. ఏ సమస్యలపై దృష్టి కేంద్రీకరించారు?**

జ॥ ఎల్లప్పుడూ ఒకే సమస్యకు ప్రాధాన్యత ఇవ్వడం మా అవగాహనకే వ్యతిరేకం. మేము ఈ రెండున్నర సంవత్సరాలుగా 'ఫోకస్' చేసిన విషయాలు కూడా అందులకు తగినట్టే ఉన్నాయనుకుంటాను.

పరిమాణం రీత్యా మాది ఇంకా చిన్న సంస్థే కాబట్టి సంఖ్యా బలం పెంచుకొనడానికి తొందర పడొద్దనుకున్నాము కాబట్టి ఏ రంగంలోనయినా మేము చేసిన కృషి కొట్టొచ్చినట్టు కనిపించికపోవచ్చు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఆదివాసుల విషయంలో కొంచెం ఎక్కువ పనిచేసినట్టున్నాము. విషజ్వరాల చావులు, ఏజెన్సీ చట్టాలను సవరించే ప్రయత్నాలు, ఆదివాసీ పోరాటాలపైన అణచివేత వీటిపైన కొంత కృషి చేసాము. కరువు సమస్య, ప్రభుత్వం ప్రచారం చేస్తున్న నీరు-మీరు కార్యక్రమాలపైన, చట్టం రూపంలోను, నిర్భంధ చట్టాలను తీసుకొచ్చే ప్రయత్నంపైన, హైదరాబాద్‌లో గుడిసెవాసుల నివాస హక్కులపైన, గత సంవత్సరం ఆగస్ట్ 28న హైదరాబాదులో జరిగిన పోలీసు కాల్పులపైన కొంత కృషిచేసాము. కృష్ణానది జలాల పంపిణీ విషయమై కరువ ప్రాంతాల సాగునీటి హక్కులను కాపాడే పద్ధతిలో కొత్త ఒప్పందాన్ని తయారు చేసుకునే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించే ప్రయత్నం ప్రస్తుతం చేస్తున్నాము. ఒక విస్తృత భూమిక, విశాలమైన ఎజెండా ఉన్న హక్కుల ఉద్యమాన్ని నిర్మించాలన్న మా లక్ష్యానికి కార్యరూపం ఇచ్చే దిశగా ప్రయాణిస్తున్నామని చెప్పగలను.


Best wishes to



మెజారిటీ
సమగ్ర తెలుగు వార పత్రిక

KONATHALA RAMAKRISHNA
FORMER M.P.
ANAKAPALLI

Best wishes to



మెజారిటీ
సమగ్ర తెలుగు వార పత్రిక

SOBHA HYMAVATHI
M.L.A.
Sringavarapu Kota